రేపు శ్రీ జగన్నాథ రథయాత్ర

సాక్షి, సిటీబ్యూరో: ప్రతీ ఏటా పూరిలో జరిగే జగన్నాథ రథయాత్రతో పాటుగా నగరంలోని శ్రీ జగన్నాథ స్వామి రాంగోపాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిష్టాత్మక జగన్నాథ రథయాత్ర రేపు (ఆదివారం) జరగనుంది. 130 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఈ రథయాత్రలో జగన్నాథ భగవానుడు, బలభద్రుడు, సుభద్ర దేవతలను ఉత్సవంగా ఊరేగిస్తామని ట్రస్టీ పురుషోత్తం మలాని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని జగన్నాథ దేవాలయంలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దర్శనానికి కేటాయించి, సాయంత్రం 4 గంటల నుంచి సోమవారం ఉదయం 4 గంటల వరకు జనరల్ బజార్ మీదుగా ఎం.జి.రోడ్, హిల్ స్ట్రీట్, రాణిగంజ్ గుండా ప్రయాణించి తిరిగి ఆలయానికి చేరుకోనుందని వివరించారు. దర్శనానికి వచ్చేవారు దర్శన సమయాలను ముందుగానే తెలుసుకోవాలని సూచించారు.

ఆర్పీఎఫ్ 'శక్తిటీమ్'తో సత్ఫలితాలు

అడ్డగుట్ట: ఆర్పీఎఫ్ శక్తిటీమ్ ద్వారా ఎన్నో సత్ఫలితాలు సాధిస్తున్నామని ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్‌సీ డెబస్మిత బెనర్జీ వెల్లడించారు. వరంగల్‌లో కిడ్నాప్‌కు గురైన ఓ బాలికను శుక్రవారం ఆర్పీఎఫ్ నాగమ్మ శక్తిటీమ్ చేరదీసి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. వరంగల్‌కు చెందిన ఓ బాలిక (14)ను గుర్తు తెలియని ఓ యువకుడు (19) కిడ్నాప్ చేశాడని వరంగల్‌లోని మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో సదరు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సమాచారాన్ని అన్ని పోలీస్‌స్టేషన్లు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులకు చేర్చారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో అనుమానాస్పదంగా కనిపిస్తున్న ఓ బాలిక, యువకుడిని గమనించిన ఆర్పీఎఫ్ నాగమ్మ శక్తిటీమ్ వారి వివరాలు సేకరించారు. వరంగల్ నుంచి పారిపోయి వచ్చిన వారిగా గుర్తించి అక్కడి పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ ఎస్ఐ సుభాని, నాగమ్మ శక్తిటీమ్ కానిస్టేబుళ్లు నీలమ్ మిన్జ్, ప్రియాంకను అభినందించారు.

తొలగిన డ్రైనేజీ సమస్య


డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

అడ్డగుట్ట: తుకారాంగేట్ పహాడీ హనుమాన్ దేవాలయం సమీపంలో మురుగునీరు నిలిచి అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించేది. ఈ సమస్యపై 'సమన్వయం లేక.. పనులు సాగక ' అనే శీర్షికతో శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జలమండలి జీఎం వినోద్‌కుమార్ స్పందించారు. సిబ్బందిని పంపించి మురుగునీటి సమస్యను పరిష్కరించారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రాహ్మణబస్తీలో...


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్, అధికారులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ బ్రాహ్మణబస్తీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శుక్రవారం పరిష్కారం లభించింది. బస్తీ రహదారుల వెంట డ్రైనేజీ నీరు మ్యాన్‌హోల్స్ నుంచి బయటకు వస్తుండడంతో స్థానికులు స్థానిక కార్పొరేటర్ సామల హేమకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్పొరేటర్ సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. జలమండలి సెక్షన్ మేనేజర్ ప్రియాంక, పర్యవేక్షకుడు శ్రీకాంత్‌తో పాటు బ్రాహ్మణబస్తీకి చేరుకున్న సిబ్బంది సమస్యను పరిష్కరించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్యం సంఘం సభ్యులు

లాలాపేట: అమావాస్య సందర్భంగా లాలాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం లాలాపేటలోని ప్రొ.జయశంకర్ స్టేడియం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు మాతా కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మడిపడిగ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదన్నారు. మనవ సేవే మాధవ సేవ అనే సంకల్పంతో లాలాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పందిరి సాంబశివ గుప్తా, కోశాధికారి ఎనిశెట్టి భాస్కర్ గుప్తా, నర్సింగరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఫ్లాట్‌ఫాం-65లో 'మాన్సూన్' మెనూ..

సనత్‌నగర్: భారతదేశ అతిపెద్ద రైలు నేపథ్య రెస్టారెంట్ ఫ్లాట్‌ఫాం-65లో మాన్సూన్ స్పెషల్ మెనూను ప్రవేశపెట్టినట్లు కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ వీహెచ్ సురేష్ తెలిపారు. ఈ మేరకు రెస్టారెంట్ 11 బ్రాంచ్‌లలో మెనూను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మెనూ స్పెషల్ లెమన్ వెజిటెబుల్ క్లియర్ సూప్, రాగి సంగటి-నాటుకోడి కూర హైలెట్‌గా ఉండనున్నట్లు వివరించారు. సీజనల్ ఆనందాలను రుచి చూడాలనుకునే వినియోగదారుల కోసం ఆయా వంటకాలను అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు.

రాగిసంగటి-నాటుకోడి పులుసు..



- అస్తవ్యస్తంగా రోడ్లు, అవస్థలు పడుతున్న ప్రజలు
- మరమ్మతులు చేయాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు


పద్మారావునగర్ పార్కు పక్కన గుంతలమయమైన రోడ్డు

చినుకులకే చిత్తడి!

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని రోడ్లు కంకర తేలి అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ప్రజల సౌకర్యార్థం జీహెచ్ఎంసీ లక్షలాది రూపాయల వ్యయంతో వేస్తున్న రోడ్లు అధికారుల పర్యవేక్షణలోపం..కాంట్రాక్టర్ల అవినీతి అక్రమాల పుణ్యమా అని వేసిన రోడ్లు మున్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. చినుకు పడితే రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ ఫ్లోరా హోటల్, బోయిగూడ, పద్మారావు, సీసీనగర్, భోలక్‌పూర్, రాణిగంజ్, మోండా మార్కెట్, గాంధీనగర్, అరుణ్‌జ్యోతి కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధాన రోడ్ల మాట ఎలాగో కాని ఇంటర్నల్, బస్తీల్లోని రోడ్లు మరీ దయనీయంగా మారాయి. రాత్రి వేళల్లో రోడ్లపై నుంచి ప్రజలు రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. రాత్రి సమయంలో రోడ్లపై ఉన్న గోతులు కనబడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు. రోడ్ల మరమ్మతుల కోసం ఏర్పాటు చేసిన ప్రైవేట్ కాంట్రాక్ట్ ఏజెన్సీ ఎక్కడ సరిగా పని చేయడం లేదని అయినా సదరు కాంట్రాక్టర్లకు బిల్లులు మాత్రం సరైన సమయానికి అందుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాణ్యత ప్రమాణాలు గాలికి..

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలనే నిబంధనలు ఉన్నా అనేక మంది కాంట్రాక్టర్లు వాటిని విస్మరిస్తున్నారు. దీంతో అవి మున్నాళ్ల ముచ్చటగానే తయారవుతున్నాయి. ప్రతిచోట కాంట్రాక్టర్లు రాత్రి వేళల్లో రోడ్లు వేస్తుంటారు..ఆ సమయంలో ఏఈ స్థాయి అధికారి అక్కడ ఉండి సదరు పనులను పర్యవేక్షించాలి. అయితే చాలా చోట్ల అనేక సందర్భాల్లో ఏఈ స్థాయి అధికారి అక్కడ ఉండకుండా సూపర్‌వైజర్, కిందిస్థాయి సిబ్బందిని పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి. దీంతో కాంట్రాక్టర్ తమ ఇష్టానుసారంగా రోడ్లు వేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఇటీవల బోయిగూడ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సమీపంలో వేసిన నూతన సీసీ రోడ్లు నాణ్యత, అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నాయనేది వాస్తవం. గతంలో పూర్తిస్థాయిలో రోడ్లు వేసే వారు ఇటీవల లేవలింగ్ పేరిట ఇరువైపులా వదిలేస్తున్నారు. దాంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక మంది తమ ఇళ్ల ముందు ఎంతో వ్యయప్రయాసాలకు లోనై తమ సొంత డబ్బులతో మరమ్మతులు చేసుకుంటున్నారు. ప్రధాన రహదారుల్లో కూడా రోడ్లు సరిగా వేయడం లేదు. వర్షం పడితే వరద నీరంతా రోడ్డుపైనే నిలుస్తుంది.

కానరాని క్వాలిటీ కంట్రోల్..

సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ లక్షలాది రూపాయల వ్యయంతో వేస్తున్న రోడ్లను సదరు విభాగంలోని క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేస్తుంటారు. సదరు రోడ్డు విషయంలో కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించారా లేదా అనే విషయాలను సదరు సంస్థ పర్యవేక్షిస్తోంది. జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో అనేక నూతన సీసీ రోడ్లు వేశారు. అయితే ఎక్కడ కూడా సదరు విభాగం సిబ్బంది పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించి నాణ్యత ప్రమాణాలు, నియమ నిబంధనలు పాటించకుండా వేసిన రోడ్ల విషయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులను హెచ్చరించి.. సదరు కాంట్రాక్టర్ బిల్లులను ఆపిన సందర్భాలు చాలా అరుదని పలువురు అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం..

జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ పరిధిలో రోడ్లు నాణ్యతతో పాటు మన్నిక ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వడంతో పాటు సదరు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటున్నాం. సీసీ రోడ్లు ఏళ్ల తరబడి మన్నికగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటాం. ధ్వంసమైన నూతన రోడ్ల విషయంలో ప్రజలు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

–ఈఈ సుదర్శన్

రేపటి నుంచి మహంకాళి అమ్మవారి ఘటోత్సవాలు


వివరాలు వెల్లడిస్తున్న ఈవో మనోహర్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరలో భాగంగా ఈ నెల 7వ తేదీ నుంచి ఘటోత్సవాలు ప్రారంభమవుతాయని దేవాలయ కార్య నిర్వహణ అధికారి గుత్తా మనోహర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనువంశిక ధర్మకర్త సురిటి కామేష్, ప్రధాన అర్చకులు రామతీర్థ శర్మతో కలిసి వివరాలు వెల్లడించారు. 7న మధ్యాహ్నం అమ్మవారి ఘటం అలంకరణ సామగ్రిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆలయ అనువంశిక ధర్మకర్తలకు అందిస్తారని దీంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. కర్బలా మైదాన్ ప్రాంతంలో అమ్మవారి ఘటం అలంకరణ పూర్తి చేసుకుని సాయంత్రం మేళతాళాలు, భక్తుల నృత్యాలు, కోలాటాలతో ఘటం రాత్రికి దేవాలయానికి చేరుకుంటుందన్నారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21వ తేదీ ఉదయం 3.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అమ్మవారికి బంగారం బోనం సమర్పిస్తారని 4 గంటలకు మహాహారతి అనంతరం సాధారణ భక్తులకు దర్శనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు వై శికాంత్ చారి, కే మహేష్‌కుమార్, విశాల్ సూదం, మురళి గౌడ్, మహేష్, రమేష్ యాదవ్, సవిత, సాయి సందీప్ పాల్గొన్నారు.

వయోవృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక దర్శనానికి అంగీకారం


ప్రత్యేక దర్శనం లేఖను అందజేస్తున్న ఈవో అంజనీదేవి

అమీర్‌పేట: ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వచ్చే వికలాంగులు, వయోవృద్ధులకు నిర్ణీత సమయంలో దర్శనం కల్పించేందుకు దేవాదాయ శాఖ అధికారులు అంగీకరించినట్లు రాయల సేవా సమితి ప్రతినిధులు తెలిపారు.ప్రత్యేక క్యూ లైన్ ద్వారా దర్శనానికి అనుమతిస్తామని ఆలయ కార్య నిర్వహణ అధికారి అంజనీదేవి స్పష్టం చేశారు. ప్రసిద్ధిగాంచిన దేవాలయాల్లో కొనసాగుతున్న విధానాన్ని మహిమాన్వితమైన గ్రామ దేవత రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సైతం అమలు చేయడంపై సంస్థ వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి


జీఎం వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శుక్రవారం కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి జలమండలి జీఎం వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో జరుగుతున్న పనుల్లో వేగం పెంచడంతో పాటు టెండర్ ప్రక్రియ పూర్తయిన పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. లాలాగూడలోని ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ, శేషాపహాడ్ వద్ద సీవరేజీ పైప్‌లైన్ పనులు, అడ్డగుట్ట సీ, డీ సెక్షన్లలో మంచినీటి పైప్‌లైన్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో సరఫరా అవుతున్న కలుషిత నీటి సమస్యను కూడా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిరుపయోగంగా ఉన్న పవర్ బోర్లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని వినతిలో కోరారు. జీఎంను కలిసిన వారిలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. రెండు రోజుల వ్యవధిలో మూడు సైబర్ నేరాలపై కేసులు నమోదు కావడం ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. ఎస్‌హెచ్ఓ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... అలీరాజ్‌అనే వ్యక్తి స్వరాజ్‌నగర్‌లో నివాసముంటున్నాడు. ఇతను ఓ న్యూస్ చానెల్‌లో పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఓ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నానని ఓ వ్యక్తి అలీరాజ్‌కు ఫోన్ చేశాడు. క్రెడిట్ కార్డు ఇన్సూరెన్స్ చేసుకోవాలని వివరాలు రాబట్టి అతని ఖాతా నుంచి రూ. 70 వేలు దోచుకున్నారు. అలాగే ఇదే బస్తీకి చెందిన మరో వ్యక్తి అబ్దుల్ సలీం అనే వ్యక్తికి కస్టమ్స్ అధికారులు మాట్లాడుతున్నామంటూ నీ పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయంటూ అతని ఆధార్ కార్డును పంపించి తనపై అధికారితో మాట్లాడాలంటూ బెదిరించారు. అనంతరం అతని ఖాతాలోంచి రూ. 20 వేలను మాయం చేశారు. సుల్తాన్ నగర్‌కు చెందిన శ్రీకాంత్‌ను సైతం కస్టమ్స్ అధికారులమంటూ బెదిరించి రూ. 80,800లను అతని ఖాతా నుంచి దోచుకున్నారు. బాధితులు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బోరబండ ఎస్‌హెచ్ఓ వీరశేఖర్ మాట్లాడుతూ... బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని చెప్పే వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దన్నారు. ఖాతాకు సంబంధించిన ఎలాంటి వివరాలు వారికి చెప్పవద్దన్నారు. తమ ఆధార్ కార్డులు, పాన్ కార్డులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. బోరబండ పీఎస్ పరిధిలో పెరుగుతున్న సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని ఆయన స్పష్టం చేశారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.43, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 70, బజ్జీమిర్చి 52, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 35, క్యారెట్ 35, దొండ 18, గుండు బీన్స్ 105, గింజ చిక్కుడు 75, గోకరకాయ 50, కీర 22, దోసకాయ 25, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 37, చామగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటీకాయ 11, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

వేవ్ రాక్ సెజ్‌లో 'స్టార్' ఆస్పత్రి ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: వేవ్ రాక్ సెజ్‌లోని పలు కంపెనీల ఉద్యోగులకు మెరుగైన సేవలు అందించేందుకు వేవ్ రాక్ సెజ్‌లో స్టార్ కార్పొరేట్ క్లినిక్ ప్రారంభమైంది. ట్రామా, యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్ ద్వారా అన్ని రకాల అత్యవసర వైద్య సేవలు అందించేందుకు సిద్ధమైంది. ప్రారంభోత్సవానికి టీఎస్ఐ బిజినెస్ పార్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్, ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ హెడ్ కల్నల్ సంజయ్ భరద్వాజ్, స్టార్ హాస్పిటల్స్ ప్రతినిధులు డాక్టర్ రాహుల్ మెదక్కర్, గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ కట్టా, గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, వాకా భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆకర్షణ 12వ లైబ్రరీ ప్రారంభం


పుస్తకాలను అందజేస్తున్న తంగెడ కిషన్‌రావు

సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఆకర్షణ సతీష్ లైబ్రరీ ఏర్పాటు పరంపరలో భాగంగా 12వ లైబ్రరీని సిద్ధం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం గ్రామంలోని ఎయిడ్స్, అనాథ గృహంలో ఈ లైబ్రరీని ఏర్పాటు చేశారు. 400 పైచిలుకు పుస్తకాలతో ఏర్పాటైన ఈ లైబ్రరీని శనివారం ప్రారంభించనున్నారు. లైబ్రరీ ఏర్పాటులో భాగంగా తెలుగు పుస్తకాలను ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు అందజేశారు.

దొంగతానికి వచ్చిన ముగ్గురి రిమాండ్

రసూల్‌పురా: ఆలయంలో హుండీ దొంగతనానికి యత్నించిన ముగ్గురిని కార్ఖానా పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 2న రాత్రి సమయంలో బీఆర్‌వో జంక్షన్ సమీపంలోని హనుమాన్ ఆలయంలోకి ఓ వ్యక్తి ప్రవేశించి హుండీ తాళాలు తెరిచి దొంగతనం చేయడానికి ప్రయత్నిస్తుండగా స్థానికులు గమనించి పట్టుకున్నారు. ఆలయం బయట ఉన్న మరో ఇద్దరు పారిపోయారు. పట్టుబడిన మొహమ్మద్ కైఫ్(20)ను విచారించగా దొంగతానికి వచ్చిన మహ్మద్ తాహేర్ (20), బి.రోహిత్(22) అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి అదృశ్యం


విజయ్‌కుమార్

అడ్డగుట్ట: మానసికస్థితి సరిగాలేని వ్యక్తి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌లోని కొండారెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన విజయ్‌కుమార్(42)కు మానసికస్థితి సరిగా లేదు. ప్రతీరోజు ఉదయం ఇంట్లో టిఫిన్ చేసిన అనంతరం బయటకు వెళ్లి తిరిగి వస్తుంటాడు. గత నెల 12న బయటకు వెళ్లిన అతను ఎంతకీ రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కార్మికులకు అండగా ఉంటా


నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని

కంటోన్మెంట్: కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. బోయిన్‌పల్లి లోని వెజిటబుల్ మార్కెట్ మినీ గూడ్స్ వెహికల్స్ డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్‌కు నూతనంగా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన తలసాని రవీందర్ యాదవ్, ఆర్గనైజింగ్ అధ్యక్షుడిగా ఎన్నికైన తలసాని శివలాల్ యాదవ్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలువగా వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా తలసాని శంకర్ యాదవ్ ఉండగా, ఆయన ఇటీవల మరణించారు. దీంతో ఆయన స్థానంలో తలసాని రవీందర్ యాదవ్‌ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. కార్మికులకు ఎలాంటి అవసరం వచ్చినా శంకర్ యాదవ్ అన్న లాగానే తాను కూడా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, ఉపాధ్యక్షుడు జనార్దన్, కోశాధికారి బీరయ్య పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు రానివ్వొద్దు

అమీర్‌పేట: ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేస్తున్న పనులను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలిస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందిన అమీర్‌పేట బీజేఆర్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాన్ని శుక్రవారం ఆయన అందజేశారు. బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం ఏర్పాట్లను పర్యవేక్షిస్తామన్నారు. కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని శాఖల సమన్వయంతో పనులు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నాయకులు కూతురు నర్సింహ, హన్మంతరావు, అశోక్ యాదవ్, వనం శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న తలసాని

నూతన ఉత్సవ కమిటీని రద్దు చేయాలి


ఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని దేవాదాయ శాఖ నియమించిన ఉత్సవ కమిటీని వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.11 మందితో కూడిన కమిటీని నియమిస్తూ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు దేవాలయ కార్య నిర్వహణ అధికారితో వాగ్వాదానికి దిగారు.సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ సూచించిన పేర్లు కాకుండా బయటి వ్యక్తులకు కమిటీలో ప్రాధాన్యం కల్పించారంటూ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. మొత్తం 14 మంది పేర్లు పంపగా 11 మందితో వేసిన కమిటీలో 5 మంది మాత్రమే స్థానికులు ఉన్నారని అమీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, సీనియర్ నేత జింకల కృష్ణయాదవ్ అన్నారు. ఉత్సవ కమిటీ కాల పరిమితిని కేవలం 4 రోజులకే పరిమితం చేశారన్నారు. వేరే ప్రాంత ప్రజా ప్రతినిధి సూచించిన వ్యక్తులకు ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. ఉత్సవ కమిటీని పూర్తిగా రద్దు చేసి స్థానికులను కమిటీలో స్థానం కల్పిస్తూ కొత్త కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ ఈవో అంజనీదేవికి వినతి పత్రం ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో శంకర్, గోదాస్ నవీన్, మహేష్, మధుగౌడ్, దీపక్, ముకేష్ పాల్గొన్నారు.

ఆధార్ కార్డు.. రేషన్ కార్డు... కాదేదీ చోరీకి అనర్హం


బంజారాహిల్స్: బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో దొంగలు పడి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పదో తరగతి సర్టిఫికెట్, హ్యాండీక్యాప్డ్ సర్టిఫికెట్‌తో పాటు నగదు, నగలు దోచుకెళ్లారు. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఫస్ట్‌లాన్సర్ అహ్మద్‌నగర్‌లో నివసించే అబ్దుల్ జలాల్ ఇంట్లోకి ఈ నెల 1న తెల్లవారుజామున అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోకి దొంగలు ప్రవేశించారు. జలాల్‌తో పాటు ఆయన భార్య రేష్మాబేగం, కొడుకు అబ్దుల్ హసీంల మూడు సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు, రూ. 8 వేల నగదు, బ్యాంక్ పాస్ బుక్, ముగ్గురి ఆధార్ కార్డులు, హ్యాండీక్యాప్డ్ సర్టిఫికెట్, పదో తరగతి సర్టిఫికెట్‌లను చోరీ చేశారు. తమ ఇంటి సమీపంలో నివసించే సల్మాన్ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తంచేస్తూ బాధితులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా సల్మాన్ తమ ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని గమనించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

సీపీఆర్‌పై శిక్షణ


శిక్షణకు హాజరైన ఆలయ సిబ్బంది, ఆశా వర్కర్లు

అమీర్‌పేట: హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో పనిచేసే సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. అమీర్‌పేట ప్రకృతి చికిత్సాలయంలో శుక్రవారం ఆలయ సిబ్బందితో పాటు ఆశా వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సీపీఆర్‌పైన శిక్షణ ఉండాలన్నారు. గుండెపోటు, ఇతర కారణాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సీపీఆర్ చేసి సకాలంలో ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు దక్కుతాయన్నారు. బోనాల విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి, స్వచ్ఛంద కార్యకర్తకు సీపీఆర్‌పై అవగాహనతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట ఆసుపత్రి డాక్టర్ రేవతి,కిమ్స్ ఆసుపత్రి వైద్య బృందం పాల్గొన్నారు.

మడ్‌ఫోర్ట్ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న నందిని మల్లు

రసూల్‌పురా: విద్యా సాంకేతిక రంగాల్లో ఎన్నో మార్పులు వస్తున్నాయని వాటి అనుగుణంగా విద్యార్థులు మారుతూ పోటీ ప్రపంచంలో విజయాన్ని సాధించాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని మల్లు సూచించారు. మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ చైర్మన్ కృష్ణ పాడిశెట్టి ఆధ్వర్యంలో అభిబస్ సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను నందిని మల్లు శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. క్రమశిక్షణ ఉన్నత ప్రమాణాలతో మంచి భవిష్యత్ పొందాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందజేస్తోందన్నారు. కృష్ణ పాడిశెట్టి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఐరీన్ సుప్రద, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కవిత, బాపూజీనగర్ పాఠశాల హెచ్ఎం ఆశీర్వాదం, ఉపాధ్యాయులు షద్రక్, గణేష్, భాస్కర్ ప్రభాకర్, శిల్ప, విజయలక్ష్మి పూర్ణిమ, శ్రీదేవి కాంగ్రెస్ నాయకులు యాదగిరి, ఇందిరా శోభన్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

సనత్‌నగర్: రంగారెడ్డి జిల్లా ఉపాధి కార్యాలయం ఎన్‌సీఎస్ (నేషనల్ కెరీర్ సర్వీసెస్), డాన్‌బాస్కో దిశ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాకు అపూర్వ స్పందన లభించింది. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సెయింట్ థెరిస్సా ప్రాంగణంలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాకు 19 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 244 మంది ఆయా కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరు కాగా అందులో 86 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి జయశ్రీ, రంగారెడ్డి జిల్లా ఎన్‌సీఎస్ యువ అధికారి విజయ్‌కుమార్, దిశా డైరెక్టర్ ఫాదర్ జస్టిన్, కోఆర్డినేటర్లు ఐవన్‌వాజ్, కార్తీక్ పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన వారితో నిర్వాహకులు